నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, శుక్రవారం 13 సెప్టెంబర్ 2024 | KARIMNAGAR


# నేడు ఓపీ సేవలు బంద్

### పెద్దపల్లిలో వైద్యుడిపై దాడికి నిరసనగా ఐఎంఏ నిర్ణయం



విద్యానగర్, సెప్టెంబర్ 12 : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పిల్లల వైద్య నిపుణుడు రాజేశ్‌పై గురువారం జరిగిన దాడిని ఐఎంఏ కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పొలాస రామ్‌కిరణ్, వెంకట్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం కరీంనగర్‌లో అత్యవసర సమావేశం నిర్వహించారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓపీ సేవలను పూర్తిగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు.




కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

# వరద బాధితులను ఆదుకోవాలి

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 12 : రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం అదుకో వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పార్టీ శ్రేణులతో కలిసి గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరద కారణంగా వ్యవసాయ రంగానికి అపార నష్టం వచ్చిందని తెలిపారు. జాతీయ విపత్తు ప్రకటించి, కేంద్ర ప్రభుత్వం పంట నష్టాన్ని అంచనా వేయాలని, రాష్ట్రానికి రూ.6 వేల కోట్లు సాయం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. నాయకులు కేదారి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సదాశివ పాల్గొన్నారు.

## రౌడీ రాజకీయం

**సిటీ రౌడీ రాజకీయాలకు** అడ్డాగా మారిందా.. ? హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయా..? అంటే అవుననే సమాధానం వస్తున్నది. పట్టపగలు..నగరం నడిబొడ్డున.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అనుచరులు, కాంగ్రెస్ గూండాలు దాడికి పాల్పడడం గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది. సవాళ్లు, ప్రతిసవాళ్ల నడుమ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ.. కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసానికి తన అనుచరులతో కలిసి వచ్చారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయితే అప్పటికే కౌశిక్‌రెడ్డి హౌస్ అరెస్టులో ఉండగా, గాంధీ అనుచరులు పోలీసులను తోసుకుంటూ.. ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో గేటు దూకి కౌశిక్‌రెడ్డి ఇంట్లోకి చొచ్చుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు..అక్కడే ఉన్న బీఆర్ఎస్ శ్రేణులపై దాడికి దిగారు. కుర్చీలన్నీ చెల్లాచెదురు చేసి.. కోడిగుడ్లు, టమాటాలు విసిరేసి.. ఇంటి అద్దాలు..పూల కుండీలు ధ్వంసం చేసి.. యుద్ధవాతావరణాన్ని సృష్టించారు. పోలీసులపై చేయిచేసుకున్నారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే గాంధీ దాడి చేసేలా వారిని ఎగదోశారు. ఇంత జరుగుతున్నా.. గాంధీ అనుచరులు, కాంగ్రెస్ గూండాల దౌర్జన్యాన్ని పోలీసులు నిలువరించలేకపోయారు. ఇదిలా ఉంటే కౌశిక్‌రెడ్డిపై దాడిని ముక్తకంఠంతో ఖండించిన బీఆర్ఎస్ నేతలు.. నిరసనలతో హోరెత్తించారు. ఇదేం ప్రజాపాలన..ఇదేం ఇందిరమ్మ రాజ్యం.. అంటూ.. నిలదీశారు. తెలంగాణను రౌడీ రాజకీయాలకు అడ్డాగా మార్చారని మండిపడ్డారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని నినదించారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు భద్రత కరువైందని.. పక్కా ప్రణాళికతోనే దాడి జరిగిందంటూ.. రేవంత్‌రెడ్డి పాలనపై ప్రజలు సైతం ధ్వజమెత్తారు.

- సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ)



దాడికి ఉసిగొల్పుతున్న ఎమ్మెల్యే గాంధీ కుమారుడు



# గాంధీ.. గూండాగిరి

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి

- పట్టపగలు.. నగరం నడిబొడ్డున
- హౌస్ అరెస్ట్ చేసి.. ఘర్షణకు ఉసిగొల్పి..
- మందీమార్బలంతో వాహనాల్లో వచ్చి..
- గేట్లపై నుంచి దూకి.. ఇంట్లోకి ప్రవేశించి..
- రాళ్లు రువ్వి.. గుడ్లు విసిరి.. టమాటాలతో దాడి
- ఇంటి అద్దాలు.. పూల కుండీలు ధ్వంసం
- కుర్చీలన్నీ చెల్లాచెదురు చేసి..

- యుద్ధవాతావరణం సృష్టించిన కాంగ్రెస్
- సిటీలో అదుపుతప్పిన శాంతిభద్రతలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కరువైన భద్రత
- దాడిని ఖండించిన నగరవాసులు
- రౌడీ రాజకీయాలకు స్వస్తి చెప్పాలని డిమాండ్

**ప్రజాస్వామ్యం అపహాస్యమైందంటూ..**

**రేవంత్‌రెడ్డి పాలనపై ధ్వజం**



ధ్వంసమైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటి అద్దాలు



కౌశిక్‌రెడ్డి ఇంట్లోకి దూకుతూ..




సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వద్ద బైఠాయించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు



కుర్చీలు విసురుతూ.. బీభత్సం సృష్టిస్తున్న కాంగ్రెస్ గూండాలు



కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి దూసుకొస్తున్న కాంగ్రెస్ నాయకుడు



ఇదేం దౌర్జన్యకాండ!



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, వివేకానంద్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

# అభినవ కర్ణుడీ శిశువు!

- బట్టల సంచిలో చుట్టి కాకతీయ కాలువలో పడేసినా.. మృత్యుంజయుడై నిలిచిన నవజాత శిశువు
- అరుపులు విని కాపాడిగిన రైతు
- తుమ్మనపల్లిలో వెలుగులోకి

అమ్మా.. నేను పుట్టగానే సంతోషిస్తావని అనుకున్నా.. పేగు బంధం తెంచగానే ఎవరో నన్ను లాక్కెళ్తుంటే నువ్వెలా భరించావమ్మా.. నన్ను ఊపిరాడకుండా గుడ్డలో చుడుతుంటే ఎలా ఊరుకున్నావమ్మా.. నీ పొత్తిళ్లలో కేరింతలు కొట్టాల్సిన నన్ను ఎక్కడో కాలువలోకి విసిరి చావు కేకలు పెట్టేలా చేశావమ్మా.. నవమాసాలు మోసి ఎలా విధిల్చుకున్నావమ్మా.. నన్ను ఎందుకిలా చేశావమ్మా.. మహాభారతంలో కుంతి చేసిన తప్పు చేశావా..? ఆ కర్ణుడిని కని పారేసినట్టు ఇలా విసిరేశావా..? ఈ తప్పు ఎందుకు చేశావమ్మా..



దొరికిన పసికందు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్12 : గురువారం మధ్యాహ్నం 12 గంటలు.. అది హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి సమీపంలోని కాకతీయ దిగువ కాలువ.. అందులో మోకాలు లోతు నీళ్లున్నాయి. తుమ్మనపల్లికి చెందిన గుండేటి చొక్కారెడ్డి తన ట్రాక్టర్‌ను కడిగేందుకు అక్కడున్న ర్యాంపు ద్వారా నీళ్లలోకి దిగాడు. ట్రాక్టర్ ఆఫ్ చేయగానే అక్కడో పసికందు ఏడుపు వినిపించింది. చుట్టుపక్కల చూసినా.. పసిపిల్లల ఆనవాళ్లు కనిపించ లేదు. గుక్కపెట్టిన ఏడుపూ ఆగలేదు. మళ్లీ చుట్టూ గమనించగా.. అక్కడ కాలువ లైనింగ్ మధ్యలో చిన్న చెట్టు కొమ్మకు తట్టుకొని ఉన్న ఒక బట్టల సంచిపై అనుమానం వచ్చింది. దగ్గరకు వెళ్లగా ఆ సంచి నుంచే ఏడుపు వినిపిస్తున్నదని గ్రహించాడు. సంచిని పరిశీలించగా ఊపిరి ఆడకుండా.. కనీసం తల కూడా కనిపించకుండా గుడ్డలతో చుట్టి ఉన్నది. దానిని విప్పి చూసేసరికి నవజాత శిశువు కనిపించింది. వెంటనే చొక్కారెడ్డి స్థానిక మాజీ సర్పంచ్ గూడూరి ప్రతాప్‌రెడ్డికి, మాజీ ఎంపీటీసీ యాళ్ల రాజేశ్వర్‌రెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. మాజీ సర్పంచ్, ఎంపీటీసీ సమాచారం ఇవ్వడంతో హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ వెంటనే ఆ శిశువును హుజూరాబాద్ ఏరియా దవాఖానకు తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. ఈ మగ శిశువు 24 గంటల కిందనే జన్మించినట్టు వైద్యులు తెలిపారు. శిశువు ఆరోగ్యంగా ఉన్నప్పటికీ సంరక్షణ కోసం కరీంనగర్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

**తల్లి పొత్తిళ్లలో హాయిగా నిద్రించాల్సిన ఓ నవజాత శిశువు, పేగును తెంచిన 24 గంటల్లోనే కాకతీయ కాలువలోకి చేరాడు. ఎందుకు భారమయ్యాడో తెలియదు గానీ, సరిగ్గా కళ్లు కూడా తెరవని ఆ పసిమొగ్గను బట్టల సంచిలో ఊపిరాడకుండా.. శరీరమంతా గుడ్డలతో చుట్టేసి నీటిలో పడేసే ప్రయత్నం చేసినా.. సురక్షితంగా బతికి బయట పడ్డాడు. నీటిలో కొట్టుకుపోకుండా ఓ గడ్డి మొక్కకు తట్టుకుని మృత్యుంజయుడై నిలిచాడు. మహాభారతంలో కర్ణుడి ఉదంతాన్ని చాటాడు.**

### మృత్యుంజయుడు

కాకతీయ కాలువలో దొరికిన బాలుడు మృత్యుంజయుడని చెప్పుకోవచ్చు! ఎవరికి భారమయ్యాడో తెలియదు గానీ, ఈ నవజాత శిశువును ఒక ప్రణాళిక ప్రకారంగానే నీటిలో పడేయాలని చూసినట్టు ఇక్కడి పరిస్థితులను చూస్తే అర్థమవుతున్నది. కరీంనగర్, వరంగల్ ప్రధాన రహదారిపై ఉన్న కాకతీయ కాలువపై ఇక్కడ వంతెన ఉంటుంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. శిశువు లభించిన సమయానికి 24 గంటల ముందే జన్మించినట్టు వైద్యులు చెబుతుండగా అంత తక్కువ సమయంలో రహదారిపై ప్రయాణిస్తూ గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో కాలువలో పడేసినట్లు తెలుస్తున్నది. శిశువుకు ఊపిరి ఆడకుండా, తలను కూడా వదలకుండా గుడ్డల్లో గట్టిగా చుట్టి ఉండడాన్ని చూస్తే ప్రత్యక్షంగా చంపేందుకు ధైర్యం రాకనే నీటిలో పడేయాలని చూసినట్టు స్పష్టమవుతున్నది. వంతెన మీదుగా ఏదో ఒక వాహనంలో వెళ్తూనే కాలువలో ఉన్న నీటిలో విసిరేసే ప్రయత్నంలో కాస్త ఒడ్డుకు ఒక కాచగడ్డి కొమ్మకు శిశువు ఉన్న బట్టల సంచి చిక్కుకున్నది. చొక్కారెడ్డి అనే రైతు అక్కడికి రావడం, శిశువు ఏడుపు విని రక్షించడం వెంట వెంటనే జరిగిపోయాయి. చొక్కారెడ్డి చూడడానికి కొద్ది సేపటి క్రితమే ఈ శిశువును ఎవరో నీటిలో పడేసే ప్రయత్నం చేసినట్టు తెలుస్తున్నది. చుట్టిన గుడ్డల పరిస్థితిని గమనిస్తే ఆలస్యమైతే గుడ్డల్లోనే శిశువు ప్రాణాలు పోయేవి. మొత్తానికి రైతు చొక్కారెడ్డితో పాటు స్థానికులు, పోలీసులు వెంట వెంటనే స్పందించడంతో ఈ నవజాత శిశువు మృత్యుంజయుడై నిలిచాడు. మహాభారతంలో కర్ణుడి ఉదంతాన్ని గుర్తు చేసిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

## కీచకోపాధ్యాయుడికి దేహశుద్ధి

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్ 12 : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఇద్దరు ఉపాధ్యాయులు వక్రబుద్ధి చూపారు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు, ఓ ఉపాధ్యాయుడికి ఏకంగా దేహశుద్ధి చేశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి హైస్కూల్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు కొంత కాలంగా విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పారు. ఈనెల 10న ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇటు ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఉదయం ప్రార్థన జరిగే సమయంలో పాఠశాలకు చేరుకున్నారు. అందరి సమక్షంలో మాట్లాడుతుండగానే ఓ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. దీనిని ముందే ఊహించి మరో ఉపాధ్యాయుడు విధులకు లీవ్‌పెట్టాడు. ఈ విషయమై హెచ్ఎం శ్యాంసుందర్‌రెడ్డిని సంప్రదించగా.. ఇద్దరు ఉపాధ్యాయుల అసభ్యకర ప్రవర్తనపై విద్యార్థులు ఫిర్యాదు చేశారని తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు విచారణ జరిపి డీఈవోకు నివేదిక ఇద్దామనుకునేలోపే గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి ఇలా చేశారన్నారు. కీచకోపాధ్యాయులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే తమ పిల్లలను పాఠశాలకు పంపేదిలేదని విద్యార్థుల తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు.

# బాలికలపై పీఈటీ దాష్టీకం

- సిరిసిల్లలో ట్రైబల్ వెల్ఫేర్ గురుకులంలో దారుణం
- స్నానాలు ఆలస్యంగా చేస్తున్నారని దాడి
- బాత్‌రూం డోర్‌లు పగలగొట్టి.. వీడియోలు తీస్తూ చితకబాదిన వైనం
- ఆగ్రహించిన విద్యార్థినులు తెల్లవారుజామునే రోడ్డెక్కి ఆందోళన
- పీఈటీని రిమూవ్ చేస్తున్నట్టు ప్రకటించిన డీఈవో రమేశ్ కుమార్

**బాలికలని కూడా చూడకుండా ఓ పీఈటీ వారిపై దాష్టీకం చూపించింది. స్నానాలు ఆలస్యంగా చేస్తున్నారన్న కోపంతో బాత్‌రూం డోర్‌లు పగులగొట్టి.. తన సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తూ చితకబాదింది. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు తెల్లవారుజామున నాలుగు గంటలకే రోడ్డెక్కడంతో అధికారయంత్రాంగం దిగివచ్చి సదరు పీఈటీని విధుల నుంచి తొలగించింది.**

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 12: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ విద్యాలయం విద్యార్థినులు ఆలస్యంగా స్నానాలు చేస్తున్నారనే నెపంతో పీఈటీ జ్యోత్స్న గురువారం వేకువజామున 3 గంటల సమయంలో వారిపై విచక్షణా రహితంగా దాడి చేసింది. అంతే కాకుండా.. బాత్‌రూంల డోర్‌లు పగులగొట్టి, స్నానపు గదుల్లోనే సెల్‌ఫోన్‌తో వీడియోలు తీస్తూ కర్రతో చితకబాదింది. దీంతో ఆగ్రహించిన విద్యార్థినులు తెల్లవారుజామున 4 గంటలకు కళాశాల నుంచి బయటకు వచ్చి బద్దెనపల్లిలోని సిరిసిల్ల–సిద్దిపేట రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో స్థానికులు మీడియా, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకుని విద్యార్థినులను శాంతింపజేయడానికి ప్రయత్నించారు. అయినప్పటికీ శాంతించకుండా పీఈటీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పీఈటీని సస్పెండ్ చేయాలని, ఎక్కడా పనిచేయకుండా చూడాలని డిమాండ్ చేశారు. తర్వాత కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను చెప్పుకుందామని బయలుదేరగా, తంగళ్లపల్లి పోలీసులు అడ్డుకుని శాంతింపజేశారు. ఎంఈవో రఘుపతి చేరుకుని విద్యార్థినిలతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే డీఈవో రమేశ్‌కుమార్‌కు ఫోన్‌లో సమస్యను వివరించగా, సంబంధిత పీఈటీ జ్యోత్స్నను రిమూవ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారని డీఈవో తెలిపారు. ఈ విషయం చెప్పడంతో విద్యార్థినులు శాంతించి, పీఈటీ రావాలని, ఇక్కడ రిమూవ్ చేసినట్టు పత్రాలు ఇవ్వాలని పట్టుబట్టారు. ఆ పత్రాలను కళాశాలకు పంపిస్తామని నచ్చజెప్పి విద్యార్థినులను ఆటోల్లో కళాశాలకు తరలించారు. అనంతరం వారు కళాశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఎంఈవో రఘుపతి చేరుకుని, పీఈటీ జ్యోత్స్నను రిమూవ్ చేశామని, విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. దీంతో సుమారు ఐదు గంటల పాటు ఆందోళన చేసి విరమించి, కళాశాలకు వెళ్లారు.



విద్యార్థినిలతో మాట్లాడుతున్న ఎంఈవో రఘుపతి

### విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్

ఇందిరమ్మకాలనీలోని గిరిజన సంక్షేమ విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మధ్యాహ్నం సందర్శించారు. పాఠశాలలో సిబ్బంది, విద్యార్థినిలతో మాట్లాడారు. పీఈటీని తొలగించినట్టు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్, ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు. కాగా, విద్యార్థుల డిమాండ్ మేరకు పీఈటీ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించాలని కలెక్టర్ సూచించడంతో పోలీసులు ప్రిన్సిపాల్ ద్వారా పీఈటీ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పంపించారు. ఆయన వెంట ప్రత్యేక అధికారి డీసీవో రామకృష్ణ, ప్రిన్సిపాల్ శకుంతల తదితరులు ఉన్నారు. అంతకు ముందు డీఈవో రమేశ్ పాఠశాలను సందర్శించారు.